

నృత్య నీరాజనం
శ్రీశైలం టెంపుల్: నిత్య కళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన లాస్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



దుర్గతి.. దుస్థితి
ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఉన్నా రాష్ట్రప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఎరిగేరి గ్రామంలోని కాలనీలో అభివృద్ధి రోడ్డెక్కలేదు. దళితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



కష్టం కరిగి.. నష్టం మిగిలి
కష్టం నేలపాలై ఉల్లి రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి పండించిన పంటను కోసి రైతులు వృథాగా వదిలేస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి బారులుదీరారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శ దర్శనం నిర్వహించుకున్నారు.

గాలేరు నగరి గేట్లు మూసివేత
అవుకు(కొలిమిగుండ్ల): అవుకు రిజర్వాయర్‌కు సంబంధించి చెర్లోపల్లె సమీపంలో ఉన్న గాలేరు నగరి వరద కాల్వకు చెందిన గేట్లను శనివారం ఎస్సార్బీసీ అధికారులు మూసివేశారు. ఇటీవల రిజర్వాయర్ రివిట్‌మెంట్ కుంగిపోవడంతో నీళ్లను గాలేరు నగరి వరద కాల్వ ద్వారా వైఎస్సార్ కడప జిల్లాకు విడుదల చేశారు. ఎస్సార్బీసీ కాల్వ ద్వారా రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లు బంద్ చేశారు. రిజర్వాయర్‌లో రివిట్‌మెంట్ కుంగక ముందు నాలుగు టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 2.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కమనీయం.. ప్రహ్లాదవరదుడి పవిత్రోత్సవం



పవిత్ర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం తెల్లవారు జామున మూలవిరాట్ శ్రీ ప్రహ్లాదవరద స్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం పవిత్ర యాగశాలలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులను కొలువుంచి నవకలశ స్నపనం, ద్వారతోరణ పూజ, మండల ప్రతిష్ఠ, కుంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పవిత్ర హోమం చేపట్టారు. రాత్రి ఉత్సవ మూర్తులను పల్లకీలో వుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

నూతన టీచర్లకు నేడు ఆర్డర్లు
కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తయ్యింది. నూతన ఉపాధ్యాయులను స్కూళ్లకు కేటాయించేందుకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ శనివారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు 4,168 టీచర్ల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఏప్రిల్‌లో 2,678 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. రాత పరీక్షలో ఎంపికైన 2,590 మందికి ఈ నెల 3 నుంచి నిర్వహించిన ఇండక్షన్ ట్రైనింగ్ ఈ నెల 10న ముగిసింది. ఇద్దరు మినహా మిగిలిన వారందరూ శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో 1,765 ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా, మిగిలిన స్కూల్ అసిస్టెంట్స్‌కు వెబ్ ఆప్షన్స్ ఇచ్చి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. కౌన్సెలింగ్‌కు హాజరైన వారందరికీ ఆదివారం ఆర్డర్లు జారీ చేయనున్నారు. వీరందరూ కేటాయించిన స్కూళ్లలో సోమవారం చేరనున్నారు.

ధర్మ ప్రచారం నిలిచి.. మల్లన్న కల్యాణం మరిచి!

- కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాల్లో కల్యాణం నిర్వహించని దేవస్థానం
- నాలుగు నెలలుగా శ్రీగిరి దాటని ప్రచారం రథం
- అధికారుల నిర్లక్ష్యంతో భక్తుల చెంతకు చేరని స్వామి అమ్మవార్లు
- కల్యాణోత్సవాల వినతులు బుట్టదాఖలవుతున్న వైనం



శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ ఉత్సవమూర్తులు

శ్రీశైలంటెంపుల్: ఆది దంపతుల కల్యాణం చూడాలంటే ఎంతో అదృష్టం ఉండాలి. పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు ఎంతో ఆరాటపడతారు. శ్రీశైల క్షేత్రానికి రాలేని భక్తుల సౌకర్యార్థం ధర్మ ప్రచారంలో భాగంగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భక్తుల చెంతకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపిస్తారు. అంతటి మహాభాగ్యాన్ని దేవస్థానం భక్తులకు దూరం చేసింది. కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాల్లో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాలు జరిపించడం లేదు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు, భక్తులు, ధార్మిక సంస్థల విజ్ఞప్తుల మేరకు గతంలో శ్రీశైల దేవస్థానం నుంచి స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి కల్యాణోత్సవాలు నిర్వహించేవారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ, హైదరాబాద్ తదితర రాష్ట్రాల్లో స్వామిఅమ్మ వార్ల కల్యాణోత్సవాలు జరిపించే వారు. దేవదాయశాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసుకుంటే కమిషనర్ అనుమతులు మంజూరు చేస్తూ శ్రీశైల దేవస్థాన ఈఓకు ఆదేశాలు జారీ చేస్తారు. అనంతరం అర్చక బృందంతో ఆయా రాష్ట్రాలకు వెళ్లి భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. కల్యాణోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై కనులారా వీక్షించి తరిస్తారు. స్వామిఅమ్మవారలు స్వయంగా తమ ఇంటి వద్దకు వచ్చి కల్యాణం జరిపించుకున్నట్లు భక్తులు మధురానుభూతి పొందేవారు. కల్యాణోత్సవంలో స్వయంగా పాల్గొనడం భక్తులు తమ అదృష్టంగా భావిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని స్వయంగా సందర్శించలేని భక్తులకు ఇదొక మంచి సువర్ణ అవకాశంగా భావించేవారు. అయితే రెండేళ్లుగా ఆ తంతు జరగడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో స్వామిఅమ్మవారలు ఇతర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది.

అమెరికా భక్తుల ఆసక్తి..
అమెరికాలో ఉన్న నాన్ రెసిడెంట్ తెలుగు (ఎన్ఆర్‌టీ) సంఘం వారు అక్కడ స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహించాలని దేవదాయశాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. అక్కడి భక్తుల విజ్ఞప్తి మేరకు కల్యాణం నిర్వహిస్తే అమెరికా భక్తుల నుంచి దేవస్థానానికి విరాళాలు సైతం పొందే అవకాశం ఉంటుంది. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి తోడ్పాటు కూడా దొరుకుతుంది. ఆ దిశగా దేవస్థాన అధికారులు చర్యలు తీసుకుని ఇతర రాష్ట్రాల్లో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాలు జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చెంచులకు దూరమై..
శ్రీశైల దేవస్థానం అధికారుల నిర్లక్ష్యంతో హిందూ ధర్మ ప్రచార రథం లక్ష్యం నీరుగారిపోతుంది. దాదాపు 15 ఏళ్ల క్రితం నుంచి ధర్మ ప్రచార రథం ద్వారా శ్రీశైల మల్లన్న, భ్రమరాంబ ప్రాశస్త్యాన్ని రాష్ట్రమంతా వివరించేవారు. ముఖ్యంగా నల్లమలలోని అటవీ ప్రాంత గిరిజనుల్లో ఆధ్యాత్మిక భావనను పెంచడంతో పాటు హిందూ ధర్మం విశిష్టతను తెలుసుకునేలా చెంచుగూడేల్లో మల్లన్న కల్యాణాన్ని నిర్వహించేవారు. చెంచులు కార్తీకమాసం, శివరాత్రి ఉత్సవాల సమయంలో శివమాల ధరించేలా అవగాహన కల్పించేవారు. అందుకు వస్త్రాలు, అవసరమైన సామగ్రిని దేవస్థానం సమకూర్చేది. అయితే కరోనా సమయంలో ఈ కార్యక్రమం నిలిచిపోయింది. ఇప్పటి వరకు చెంచు గూడేల్లో మల్లన్న కల్యాణం పునఃప్రారంభించేందుకు దేవస్థానం అధికారులు ముందుకు రావడం లేదు.

ప్రభుత్వ అనుమతితో నిర్వహిస్తాం



వివిధ రాష్ట్రాల్లో మల్లన్న కల్యాణోత్సవం ఢిల్లీ ఆంధ్రా భవన్ ఆధ్వర్యంలో గతంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరణ చేసే ఆలోచనలో ఉన్నాం. నాన్ రెసిడెంట్ తెలుగు (ఎన్ఆర్‌టీ)సంఘం వారి సహకారంతో అమెరికాలో స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహించాలని ఆలోచిస్తున్నాం. అమెరికాలో స్వామివారి కల్యాణం విషయమై ప్రభుత్వం, దేవదాయశాఖ మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో నిర్వహిస్తాం. స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవంలో ఎన్ఆర్ఐలను భాగస్వామ్యులను చేసి వారి నుంచి విరాళాలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాం.
– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

శ్రీగిరి దాటని మల్లన్న..
శ్రీశైల దేవస్థానం ఇతర ప్రాంతాల్లో మల్లన్న కల్యాణోత్సవాన్ని దాదాపు రెండేళ్లుగా నిర్వహించడం లేదు. స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని ఇతర రాష్ట్రాల్లో జరిపించాలంటే దేవదాయశాఖ కమిషనర్ అనుమతి కావాలి. భక్తుల నుంచి విజ్ఞప్తుల మేరకు, ధార్మిక సంస్థలు, ప్రజాప్రతినిధుల సిఫారసు మేరకు ఆయా ప్రాంతాలకు వెళ్లి స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారు. వారం ముందుగానే దరఖాస్తు చేసుకున్న సంస్థకు, వ్యక్తికి సమాచారం అందించి అక్కడి ఏర్పాట్లపై వాకబు చేసి తదుపరి అన్ని ఏర్పాట్లు చేశారు అని నిర్ధారించుకున్న తరువాత వెళ్తారు. కల్యాణం కోసం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులు, కల్యాణ సామగ్రి, స్వామిఅమ్మవార్ల చిత్రపటాలు, శేషవస్త్రాలు తీసుకెళ్తారు. కల్యాణం కోసం వెళ్లిన సిబ్బందికి వసతి, భోజన సదుపాయాలు దరఖాస్తు, విజ్ఞప్తి చేసుకున్న సదరు వ్యక్తులు, సంస్థలు కల్పించాలి. స్వామివారి ఆలయం నుంచి అర్చకులు, పరిచారకులు, అమ్మవారి ఆలయం నుంచి అర్చకులు, ఇద్దరు వేదపండితులు, కల్యాణం నిర్వహించే అర్చకులు, గుమస్తా, ఇద్దరు డ్రైవర్లు, ఒక హెల్పర్, మరో ఇద్దరు వ్యక్తులు మొత్తం 12 మంది వెళ్తారు. అయితే దాదాపు రెండేళ్లుగా ఆది దంపతుల కల్యాణం ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం లేదు. వినతులు వస్తున్నా అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



ఢిల్లీ వీధుల్లో ధర్మ ప్రచార రథం (ఫైల్)

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత
- నూతన జాయింట్ కలెక్టర్ కొల్ల బత్తుల కార్తీక్



బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ కార్తీక్

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని నూతన జాయింట్ కలెక్టర్ కొల్లబత్తుల కార్తీక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిపాలనలో సమర్థత, పారదర్శకతను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానన్నారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ ఎం.జావళి

నంద్యాల: దీపావళి సందర్భంగా బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలు, దుకాణాలలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం.జావళి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించిన వారిపై పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు, సూచనలు పాటిస్తూ షాప్‌లు ఏర్పాటు చేసుకుని టపాసులను విక్రయించాలన్నారు. జనసంచారం, ప్రజల నివాస ప్రాంతాలలో టపాసులు విక్రయించరాదని, ప్రభుత్వ అధికారులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 112 లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

బిట్‌కాయిన్ పెట్టుబడుల పేరుతో మోసాలు
కర్నూలు: బిట్‌కాయిన్ పెట్టుబడుల విషయంలో స్మార్ట్ ఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెట్టుబడులు పెడితే లాభాలు వస్తున్నాయంటూ ఫాలోయర్లకు నకిలీ లింకులు పంపుతున్నారని, బిట్‌కాయిన్‌ను క్రిప్టో కరెన్సీలలో మదుపు చేస్తే లాభాలంటూ స్నేహితులకు సందేశాలు పంపుతున్నట్లు పేర్కొన్నారు. లాభాలు వచ్చినట్లు కొన్ని ఫొటోలు చూపించి ఆశ కల్పిస్తారని, ఆ సందేశాలు చూసి కొందరు లింకు ద్వారా రూ.లక్షల్లో నగదు పెట్టుబడి పెట్టి నష్టపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా టెలిగ్రామ్, ఫేస్‌బుక్‌లలో డబ్బులు ఇన్వెస్ట్ చేయడానికి లింకులు వస్తే అసలు క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి ఎవరైనా గురైతే వెంటనే సైబర్ క్రైం 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు, అలాగే www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

మోదీ పర్యటనను విజయవంతం చేద్దాం



ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శనివారం నన్నూరు సమీపంలోని రాగమయూరిలో జరుగుతున్న ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రులు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పీఎం ప్రోగ్రామ్ నోడల్ అధికారి వీరపాండియన్, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తదితరులు పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై అధికారులతో మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ స్థానికంగా టోల్‌గేట్ వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో 16వ తేదీన టోల్‌ఫీజు లేకుండా వాహనాలను వదలాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ప్రోగ్రామ్ నోడల్ అధికారి వీరపాండియన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో శ్రీశైలం, కర్నూలులో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీశైల దర్శనం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ప్రధానమంత్రి మోదీ బహిరంగసభలో పాల్గొంటారన్నారు. సభా ప్రాంగణంలోకి పెన్నులు, నోటుబుక్‌లు, మ్యాచ్ బాక్సులు, సిగరెట్లు, స్నాక్స్ వంటివి అనుమతించకూడదని, కేవలం నీటిని మాత్రం కప్‌ల ద్వారా ట్రేలలో అందిస్తారన్నారు. సెక్యూరిటీ పరంగా 250 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇదిలాఉంటే ఆదివారం ప్రధానమంత్రి పర్యటించే రూట్లన్నీ ఎస్‌పీజీ సెక్యూరిటీ ఆధీనంలోకి వెళ్తాయని ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్, విజయ సునీత, శివ్ నారాయణ్, డాక్టర్ బి.నవ్య, గణేష్‌కుమార్, గీతాంజలి, జేసీ నూరుల్ ఖమర్, ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్ పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మరింత పతనం
కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ధరలు మరింత పడిపోయాయి. వేరుశనగ మద్దతు ధర రూ.7,263 ఉండగా మార్కెట్‌లో గరిష్ఠంగా లభించిన ధర రూ.5,800 మాత్రమే. మార్కెట్‌కు 85 లాట్ల వేరుశనగ వచ్చింది. కనిష్ఠంగా రూ.3,402, గరిష్ఠంగా రూ.5,800 లభించగా.. సగటు ధర రూ.5,266 నమోదైంది.

- మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,400. మార్కెట్‌లో మాత్రం కనిష్ఠ ధర రూ.1,695, గరిష్ఠ ధర రూ.1,721 మాత్రమే లభిస్తోంది.
- సజ్జకు మద్దతు ధర రూ.2,775 ఉండగా మార్కెట్‌లో కనిష్ఠంగా రూ.1,661, గరిష్ఠంగా రూ.2,200 పలికింది. సగటు ధర రూ.1,850 మాత్రమే నమోదైంది.
- ఉల్లి ధరలు అధ్వానంగా ఉంటున్నాయి. మార్కెట్‌కు రూ.2,174 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. కనిష్ఠ ధర రూ.208, గరిష్ఠ ధర రూ.1289 లభించగా.. సగటు ధర రూ.587 నమోదైంది. అన్ని రకాల పంట ఉత్పత్తుల ధరలు పడిపోయి రైతులు అల్లాడుతున్నా కూటమి ప్రభుత్వం మేల్కొనకపోవడం గమనార్హం.

అంతర పంటల సాగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి

బనగానపల్లె రూరల్: అంతర పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి అన్నారు. శనివారం యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ధన ధాన్య కృషి యోజనపై రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన అధికారి ధనలక్ష్మీ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ధన ధాన్య కృషి యోజన ద్వారా పుప్పుధాన్యాలు, పశుపోషణ, ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ జాన్సన్ మాట్లాడుతూ.. పూర్వం దేశం పంటల ఉత్పత్తుల్లో మొదటి స్థానంలో ఉండేదని, కాలక్రమేణా వాతావరణ ప్రభావం వల్ల 24 రకాల పంటల ఉత్పాదకత తగ్గిందన్నారు. పంటల సరళిలో మార్పులు చేపట్టి దిగబడులు పొందాలని కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భూషన్న, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కేవీకే ఏఈఓ సురేష్, బనగానపల్లె గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ బురానుద్దీన్ ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విత్తుకోని ఆశలు.. పొలాలు బీళ్లు!

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రారంభమైన రబీ
- అతీగతీ లేని సబ్సిడీ విత్తనాలు
- అరకొరగా పంట రుణాల పంపిణీ
- వేధిస్తున్న ఎరువుల సమస్య
- పొంచి ఉన్న అధిక వర్షాల గండం



రబీ సీజన్‌కు భూములను సిద్ధం చేస్తున్న దృశ్యం

కర్నూలు (అగ్రికల్చర్): రెక్కల కష్టాన్ని నమ్ముకున్న రైతుకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. ఎరువులు అందక, ప్రకృతి సహకరించక, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం లేక నష్టాలే మిగులుతున్నాయి. ఖరీఫ్‌లో వేసిన పంటలన్నీ మట్టిపాలయ్యాయి. అరకొర పండిన పంటలకు మార్కెట్‌లో మద్దతు ధర కూడా లభించక మట్టి మనిషికి కన్నీళ్లే దిక్కయ్యాయి. రబీపై ఆశలు పెట్టుకున్నా.. బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా మొండికేశాయి. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో చాలా పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

అవసరం ఎక్కువ... కేటాయింపు తక్కువ
జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు ఉండగా 3.85 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ప్రకృతి వైపరీత్యాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పంటలు దెబ్బతిని 2.50 లక్షల మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీలో శనగ సాగు చేద్దామనుకుంటే సబ్సిడీ విత్తనాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. విత్తనం వేయకపోవడంతో పొలాలు బీళ్లుగా దర్శనం ఇస్తున్నాయి. జిల్లాకు 46 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరం అవుతాయని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించగా 23,897 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. వీటిలో 10 వేల క్వింటాళ్లు ఏపీ సీడ్స్‌లో ఉన్నాయి. ప్రయివేటు విత్తన కంపెనీల దగ్గర శనగ విత్తనాలు ఉన్నప్పటికీ గత ఏడాదికి సంబంధించిన బకాయిలను ఇప్పటికి చెల్లించలేదు. ఉన్న అరకొర విత్తనం ఎవరికి పంపిణీ చేయాలో తెలియక వ్యవసాయ అధికారులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. రబీలో శనగతో పాటు వేరుశనగ, జొన్న తదితర పంటలు సాగు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం శనగ విత్తనాలను మినహా ఇతర విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయడానికి తీసుకున్న చర్యలు శూన్యం.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం నిల్
రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు ఎగనామం పెట్టింది. కేంద్ర వాటా విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ ప్రారంభంలోనే కొన్ని పంటలు దెబ్బతిన్నా పరిహారం ఇవ్వలేదు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.14 వేలకు కుదించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పంట రుణాల పంపిణీలో నిర్లక్ష్యం
రైతులకు ఎటువంటి హామీ లేకుండానే రూ.2లక్షల వరకు రుణాలు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఎటువంటి చర్యలు లేవు. పంటరుణాల పంపిణీలో కొన్ని బ్యాంకులు తీవ్ర అలసత్వం వహించాయి. ఖరీఫ్ సీజన్ సెప్టెంబరు నెల చివరితో ముగిసింది. ఖరీఫ్‌లో రూ.3,635.62 కోట్లు పంట రుణాలుగా పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా రూ.2,537.61 కోట్లు మాత్రమే పంపిణీ చేసినట్లు స్పష్టం అవుతోంది. పలు బ్యాంకులు కొత్త రైతులకు రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. రబీ సీజన్‌లో రూ.2,526.44 కోట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యం. ఖరీఫ్‌లో రైతులకు మొండిచెయ్యి చూపిన బ్యాంకులు రబీలో పంపిణీ చేయడం అనుమానమేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఎరువులు అందేనా?
రబీ సీజన్‌లో శనగ, జొన్న, వాము, వరి, వేరుశనగ తదితర పంటలు కర్నూలు జిల్లాలో 1.01 లక్షలు, నంద్యాల జిల్లా 1.73 లక్షల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉంది. కర్నూలు జిల్లాకు లక్ష టన్నులు, నంద్యాల జిల్లాకు 1.52 లక్షల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించింది. రబీలోనూ ఎరువుల సమస్య వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ధర ఎక్కువ.. సబ్సిడీ తక్కువ

- బహిరంగ మార్కెట్‌లో శనగల కిలో ధర గరిష్ఠంగా రూ.55 వరకు మాత్రమే ఉంది. ప్రభుత్వం సబ్సిడీ పోను కిలో శనగ విత్తనాలను రూ.58.50 ప్రకారం పంపిణీ చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధిక ధర నిర్ణయించి సబ్సిడీ మాత్రంగా 25 శాతానికే పరిమితం చేయడంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.
- ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసే శనగ విత్తనాలు కిలో ధరను రూ.78గా నిర్ణయించింది. ఇందులో 25శాతం సబ్సిడీ (రూ.19.50) పోగా రైతులు కిలోకు రూ.58.50 చెల్లించాల్సి ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఇంతకంటే తక్కువ ధరకు లభిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ 20కిలోల ప్యాకెట్లతో శనగ విత్తనాలు సిద్ధం చేస్తోంది. ఎకరాకు 80కిలోల శనగలు అవసరం. అయితే ఎకరాకు 60 కిలోలు(3 ప్యాకెట్లు) మాత్రమే పంపిణీ చేయనున్నారు. భూమిని బట్టి ఎకరాకు గరిష్ఠంగా 10 ప్యాకెట్లు(2 క్వింటాళ్లు) పంపిణీ చేస్తారు.

జిల్లాల వారీగా రబీ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో..)

పంట	కర్నూలు	నంద్యాల
వరి	4,314	29,084
జొన్న	9,790	29,212
మొక్కజొన్న	6,558	12,032
పప్పుశనగ	59,608	59,881
మినుము	899	29,171
వేరుశనగ	14,902	3,058
ఇతరపంటలు	11,243	10,972
మొత్తం	1,01,314	1,73,410

విత్తనాలు ఇవ్వలేదు



మాకు నల్ల రేగడి నేలలు ఉన్నాయి. శనగ కోసం 10 ఎకరాల భూమిని సిద్ధం చేసుకున్నాం. ఖరీఫ్‌లో 10 ఎకరాల్లో ఉల్లి సాగు చేయగా దీనిని దున్నేసి శనగ సాగు చేయనున్నాం. సబ్సిడీపై పంపిణీ చేసే శనగ ధరలు మాత్రం ఖరారు చేసింది. బహిరంగ మార్కెట్‌లో కంటే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అయినా ఇప్పటి వరకు విత్తనాలు ఇవ్వలేదు.
– మహేశ్వరరెడ్డి, వెంకటగిరి, కోడుమూరు మండలం

క్లుప్తంగా

పత్తి మద్దతు కొనుగోళ్లు మరింత ఆలస్యం

కర్నూలు(అగ్రికల్చర్): మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే దాదాపు 2 లక్షల క్వింటాళ్ల పత్తి అమ్మకాలు జరిగాయి. పత్తి కనీస మద్దతు ధర రూ.8,110 ఉన్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో క్వింటా పత్తి రూ.6,500 నుంచి రూ.7వేల వరకు ధరతో అమ్ముకొని నష్టపోయారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగు 2,34,409 హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 2.26 లక్షల హెక్టార్లలో పత్తి సాగయింది. అధిక వర్షాల వల్ల పత్తి పంట భారీగా దెబ్బతినింది. దిగుబడులు హెక్టారుకు కనీసం 10 క్వింటాళ్లు పడిపోయింది. అంతంత మాత్రం వచ్చిన దిగుబడులకు కూడా ధర లేక పోవడం తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచే మార్కెట్‌లోకి పత్తి వస్తోంది. మామూలుగా అయితే సెప్టెంబర్ 20 నాటికే సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు మద్దతు ధరతో పత్తి కొనుగోలుకు జిన్నింగ్ మిల్లులను కూడా నోటిఫై చేయలేదంటే కూటమి ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతోంది. మార్కెటింగ్ శాఖ అధికారుల సమాచారం మేరకు ఈ నెల 21 నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టాలనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలుస్తోంది.

గ్యాస్‌లీక్ ఘటనలో గాయపడిన తల్లి, బిడ్డ మృతి


సువర్ణ (ఫైల్)

వెల్దుర్తి: వంట గ్యాస్ లీకై బోయనపల్లె గ్రామంలో గత ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన వడ్డె నాగరాజు కోలుకోలేక కర్నూలులోని ఆసుపత్రిలో శుక్రవారం మృతి చెందారు. శనివారం ఉదయం గర్భిణి సువర్ణకు అబార్షన్ అయ్యింది. అనంతరం చిన్న కుమారుడు నాలుగేళ్ల చరణ్ కోలుకోలేక మృతి చెందాడు. తండ్రి, కుమారుడి అంత్యక్రియలు బోయనపల్లె గ్రామంలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన అనంతరం కర్నూలు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్న సువర్ణ సైతం మృతి చెందింది. దీంతో గ్యాస్ లీక్ ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది.ప్రస్తుతం ఆసుపత్రిలో 12 ఏళ్ల అనిల్ చికిత్స పొందుతున్నాడు. కూలీ పనులు చేసి జీవనం సాగించే వడ్డె నాగరాజు కుటుంబంలో ఒక్కసారిగా ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

ఈతకు వెళ్లి వ్యవసాయ విద్యార్థి మృతి


జనార్దన్ నాయక్ (ఫైల్)

మహానంది: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం బలిగొంది. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి పాలేరు వాగులో నీట మునిగి మృతి చెందాడు. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...చిత్తూరు జిల్లా కంభంవారిపల్లె మండలం జిల్లెలమంద సమీపంలోని పెద్దతాండకు చెందిన బి.జనార్దన్‌నాయక్ (21) మహానంది సమీపంలోని వ్యవసాయ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో శనివారం కళాశాల సమీపంలోని పాలేరువాగు వద్దకు తోటి విద్యార్థులతో కలిసి వెళ్లాడు. అక్కడ కొంత మంది దుస్తులను శుభ్రం చేసుకోవడంతో పాటు ఈతకు దిగారు. ఈ క్రమంలో ఐదారుగురు ఈతకు దిగగా సరిగా ఈత రాని జనార్దన్ నాయక్ వాగులోకి దిగాడు. కొద్ది సేపటికి పక్కనే ఉన్న అతను కనిపించకపోవడంతో మిగిలిన విద్యార్థులు అన్వేషించగా అక్కడే లోతు ఉన్న గుంతలో అపస్మారక స్థితిలో కనిపించాడు. బయటికి తీసి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, పోలీసులు, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


కాలనీలోని రోడ్డు


ప్రతి వరుసలో ఇలాంటి దృశ్యాలే


ఈ బురద నీటిలోనే ఇండ్లకు చేరాలి


ఇలాంటి మడుగులోనే తిరగాల్సిన పరిస్థితి

దుర్గతి.. దుస్థితి

- ఎరిగేరి గ్రామంలో కానరాని సౌకర్యాలు
- ఆర్డీటీ కాలనీలో బురద నీటిలోనే ప్రయాణం
- ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఉన్నా స్పందించని ప్రభుత్వం


అంగన్‌వాడీ విద్యార్థుల అవస్థలు

కౌతాళం: అభివృద్ధి రోడ్డెక్కలేదు. దళితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఉన్నా రాష్ట్రప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో అట్టడుగు వర్గాల వారికి కష్టాలు నిత్యకృత్యం అయ్యాయి. కౌతాళం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో ఆర్డీటీ సంస్థ వంద మందికి ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ఇక్కడి వరకు బాగానే ఉన్న కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కాలనీలో నీరు రెండు అడుగుల నుంచి మూడు అడుగుల వరకు నిలబడి దుర్వాసన వస్తోంది. నీరు బయటకు పోవడానికి ఎలాంటి అవకాశం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో కాలనీ వాసులు నిరసనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈనెల 6న ఆదోని రోడ్డులో బైటాయించి సుమారు రెండున్నర గంటల పాటు నిరసన తెలిపారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ కలెక్టర్‌తో చర్చించి 24 గంటల్లోపు రోడ్లకు గ్రావెల్ వేస్తామని తెలిపారు. నాలుగు రోజులు పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు. ఈ కాలనీలో రెండు అంగన్‌వాడీ సెంటర్లు అధ్వానంగా ఉన్నాయి.

వెలుగులు ఇచ్చిన ఎమ్మెల్యే

ఈ కాలనీ కోసం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సొంత నిధులతో సుమారు 50 వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ప్రజలకు వెలుగు ఇచ్చారు. ఇటీవల పాత కాలనీ నుంచి వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు కూడా బయటకు పోయే విధంగా సుమారు రూ. 10 లక్షలు ఎంపీపీ నిధులతో కొత్తగా డ్రైనేజీని నిర్మించారు. ఎస్సీ కాలనీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఉంటాయి. అయితే వాటిని వినియోగించడం లేదు.

వృద్ధులు ఎలా తిరగాలి



మాలాంటి వృద్ధులు ఈ వర్షపు బురద నీటిలో ఎలా తిరగాలి. ఇంతటి దారుణ పరిస్థితిని ఎప్పుడు చూడలేదు. కనీసం తిరగడానికి వీలు ఉండేలా రోడ్డుపై కనీసం గర్సు వేస్తే బాగుంటుంది.

–మారెమ్మ

సౌకర్యాలు కల్పించండి సారూ



మా కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి. తిరగడానికి వీలు కల్పిస్తే చాలు. మేం డబ్బు అడగడం లేదు. కేవలం సౌకర్యాలు మాత్రమే అడుగుతున్నాం. పరిస్థితిని అర్థం చేసుకోవాలి.

–పద్మ

బాధలు తెలుసుకోవాలి



ఎన్నిసార్లు నిరసనలు తెలిపినా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. కాలనీలో తిరగడానికి వీలు ఉండేలా కనీస వసతులు ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం మా బాధలు తెలుసుకోవాలి.

–చెన్న

కామినేని హాస్పిటల్ వద్ద మృతదేహంతో ఆందోళన


మృతదేహంతో ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటుతో వచ్చిన రోగి మృతిచెందడంతో కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ వద్ద మృతుని కుటుంబ సభ్యులు శనివారం ఆందోళన చేశారు. కర్నూలు మండలం మునగాలపాడుకు చెందిన పెద్దమాదన్న(56)కు గుండెపోటు రావడంతో ఈనెల 5న కామినేని హాస్పిటల్‌లో చేర్పించారు. మల ద్వారం నుంచి రక్తస్రావం అవుతుండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. గురు, శుక్రవారాల్లో కూడా గుండె ఆపరేషన్ వాయిదా పడింది. కాగా శనివారం మధ్యాహ్నం ఆయన కోలుకోలేక మృతిచెందాడు. వైద్యులు సకాలంలో ఆపరేషన్ చేసి ఉంటే బతికేవాడంటూ అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక మహిళ మృతి


శశికళ(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం అర్ధరాత్రి చెందింది. ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన ధనుంజయ్‌గౌడ్, శశికళ(30) ప్రేమించుకున్నారు. వీరికి వేర్వేరుగా పెళ్లిళ్లు అయినా ఇద్దరు కలసి ఉండాలని నిర్ణయించుకున్నారు. కొన్నాళ్లు కలసి ఉండగా ఈ నెల 6వ తేదీన శశికళ వేధిస్తుందని ధనుంజయ్‌గౌడ్ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మరసటి రోజే శశికళ పురుగు మందు తాగడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందింది. క్షణికావేశంలో ఇద్దరు ఆత్మహత్య చేసుకోవటంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ముగతి పేటలో చోరీ


బీరువా పగలగొట్టి చోరీకి పాల్పడిన దొంగలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ముగతి పేటలో శనివారం చోరి జరిగింది. కాలనీకి చెందిన యూసూఫ్ ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. భార్యకు ఆరోగ్యం బాగలేకపోతే ఆదోనిలోని ఓ హాస్పిటల్లో వైద్యం చేయిస్తున్నాడు. రోజూ ఆదోనికి వెళ్లి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆదోనికి వెళ్లి శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారు, కేజీ వెండి, రూ. 70వేలు నగదు చోరీకి గురైనట్లు యూసుఫ్ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

గ్రేహౌండ్స్ బలగాలతో కూంబింగ్


గ్రేహౌండ్స్ బలగాలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్ర సందర్శనకు ఈ నెల 16న భారత ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో భద్రత పరంగా పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్ బలగాలతో శనివారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో శ్రీశైల ఆలయం, ఆలయ పరిసరాలు, హెలిపాడ్, నల్లమల అడవుల్లో కూంబింగ్ నిర్వహించారు. అంతకు ముందు స్థానిక పోలీసు స్టేషన్‌లో గ్రేహౌండ్స్ బలగాలకు ప్రత్యేక సూచనలు చేశారు. ప్రధాని పర్యటన ముగిసేంత వరకు నల్లమల అడవుల్లో కూంబింగ్ నిర్వహించడం జరుగుతుందని డీఎస్పీ తెలిపారు.

మృత శిశువు కలకలం

నంద్యాల: పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. ఏ తల్లికి పుట్టిన బిడ్డో, ఎందుకు భారమయ్యాడో తెలియదు కాని చిన్నారి మృతదేహాన్ని ఇళ్ల మధ్యలో ఉన్న డ్రైనేజీలో పడేసి పోయారు. చనిపోయాక అక్కడ పడేశారా.. లేక ప్రాణం ఉన్న శిశువును అక్కడ వదిలేయడంతో మరణించారా అన్నది తెలియాల్సి ఉంది. పట్టణంలోని విశ్వనగర్ ఇళ్ల మధ్యలో దుర్వాసన వస్తుండటంతో స్థానికులు డ్రైనేజీ కాల్వ వద్దకు వెళ్లి చూడగా అక్కడ మగ శిశువు మృతదేహం కనిపించింది. ఎప్పుడు అక్కడ పడేశారో తెలియదు కాని శిశువు మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. ఈ విషయాన్ని స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ అస్రార్‌బాషా, ఎస్‌ఐ సురేష్ అక్కడ చేరుకొని శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. శిశువు మృతదేహాన్ని బట్టి కొన్ని రోజుల క్రితమే ఇక్కడ పడేసినట్లు కనిపిస్తుందని, స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించగా వారి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆరిపోయిన ఆశల దీపం

- స్కూటర్‌పై నుంచి పడి బాలుడి మృతి


మృతి చెందిన భీరప్ప

మంత్రాలయం రూరల్: విధి ఆడిన నాటకంలో ఓ చిన్నారి జీవితం అర్ధంతరంగా ముగిసిపోయింది. ఆ ఇంట తీరని శోకాన్ని నింపింది. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన దేవర నాగప్ప, వీరేషమ్మ దంపతుల ఏకైక పుత్రుడు భీరప్ప (5). వంశాంకురమని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ఆ ఇంటిల్లిపాది తమ భవిష్యత్తును తనలోనే చూసుకున్నారు. పెద్దనాన్న సైతం అతనిపై ప్రాణం పెంచుకున్నాడు. శనివారం రోజూలాగే పెద్దనాన్న భీరప్పను తన స్కూటర్‌పై గ్రామంలోని మారెమ్మ దేవాలయం చెంతకు తీసుకెళ్లాడు. స్కూటర్‌ను ఆపుకుని ఉండగా అటుగా కాజన్న తన ఎడ్ల బండితో పొలానికి వెళ్తుండగా.. ఒక్కసారిగా ఎద్దులు బెదిరి స్కూటర్ వైపు దూసుకెళ్లాయి. ఎద్దులు స్కూటర్‌ను తగలడంతో పడిపోయింది. అయితే బైక్‌పై ఉన్న భీరప్ప దాని కింద పడటంతో మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు తనువు చాలించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. గ్రామమంతా శోకసంద్రంగా మారింది.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: సారా తయారీ చేసినా, విక్రయించినా చట్ట పరమైన చర్యలు తప్పవని కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ రాజశేఖర్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని నీలిషికారిపేటలో రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై దాడి చేసి 220 లీటర్ల బెల్లం ఊటను, 10 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. పట్టణంలో సారా తయారీ స్థావరాలపై దాడులు చేయడంతో పాటు కల్లు దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా రవాణా చేస్తే క్రిమినల్ కేసులతో పాటు వాహనాలు సీజ్ చేసి జైలుకు పంపడం ఖాయమని హెచ్చరించారు. దాడుల్లో కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ మారుతి ప్రసాద్,పట్టణ ఎక్సైజ్‌శాఖ ఎస్‌ఐ జహ్రూల్లా, హెడ్ కానిస్టేబుల్ కృపవర కుమారి, పద్మనాభం, రామాంజనేయులు, పోలీసులు మధుసూదన్, ప్రసాద్, శ్వేతారాణి, రమిజాబీ, అల్లాస్వామి, జయచంద్రుడు, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టం కరిగి.. నష్టం మిగిలి


కోడుమూరులో ఉల్లిని పశువులకు వదిలేసిన దృశ్యం

తుగ్గలి/ కోడుమూరు రూరల్: ఆరుగాలం కష్టించి, లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పండించిన ఉల్లి పంటకు ధర లేకపోవడంతో రైతులకు నష్టమే మిగులుతోంది. తుగ్గలి మండలం రాతనకు చెందిన రైతు వీరాంజనేయులు ఉల్లి పంటను కోసి వృథాగా పడేశాడు. తనకున్న 3.5 ఎకరాలతో పాటు ఎకరా రూ.15వేలు చొప్పున మరో రెండెకరాలు గుత్తకు తీసుకుని ఉల్లి పంట సాగు చేశాడు. మొత్తం రూ.3లక్షల పెట్టుబడి పెట్టాడు. ఉల్లి పంట మధ్యలో వాము పంటవేశాడు. దాన్ని కాపాడుకునేందుకు ఉల్లి పంట పీకి పారబోస్తున్నట్లు చెప్పారు. కోడుమూరులో ఓ రైతు పొలంలో నుంచి ఉల్లిగడ్డలను తెచ్చి ఖాళీ స్థలంలో కుప్పగా పోసి పశువులకు మేతగా వదిలేశారు. గిట్టుబాటు ధరలేక పశువులకు ఉల్లి పంటను మేతగా వదిలేయడాన్ని చూసిన జనాలు అయ్యో పాపం రైతన్న అంటూ నిట్టూర్చారు.

ప్రత్యేక ఆహ్వానితులు లేనట్లే!

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల సలహా మండలికి 17 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం తెలిసినదే. అయితే వారం క్రితం అధికార పార్టీ శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు సభ్యులను ప్రకటించినట్లు సోషల్ మీడియా, అధికార పార్టీ అనుబంధ మీడియాలో వార్తలు వచ్చాయి. వీరిలో చైర్మన్‌గా ఒకరిని, 16 మంది బోర్డు సభ్యులుగా, మరో నలుగురిని ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రకటించినట్లు సోషల్ మీడియాలో ప్రచారాలు నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కారుపర్తి నాగమల్లేశ్వరరావు (పి.గన్నవరం), వేమిరెడ్డి కోటారెడ్డి (నెల్లూరు), బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి (డోన్), కట్టా సుధాకర్‌రెడ్డి (తెలంగాణ) వీరిని పార్టీ పరంగా విడుదల చేసిన కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా వీరి పేర్లు ఉన్నాయి. అయితే శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించిన వారికి చోటు దక్కలేదు. శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డులో స్థానం దక్కిందనే ఆనందంతో బంధువులకు, సన్నిహితులకు గొప్పగా చెప్పుకున్నాక ఇప్పుడు స్థానం దక్కకపోవడంతో వారు నిరాశ చెందుతున్నారు.